# "మగవాళ్లు లేరు"

'సాగర్'

ఆ దారంట నేను వెళ్ల నే వెళ్లను. అధవా వెళ్ళినా, ఆగుమ్మంకేసి చూడను. నేను చూచినా చూడకపోయినా, ఆవిడ ఆసమయానికి గుమ్మంలో వుండటం తటస్థించదీ అంటే—ఆమె యింట్లోకి దూసుకపోవడం, ఆ గుమ్మం తలుపులు 'ఫెడీ' లని శబ్దంచేయటం జరుగుతుంది.

ఒకరోజున నేను వాళ్ళింటిగుమ్మంలో కాలు పెట్టాను. దానికి కారణం- నాకు ఆమెమీద అమాంతం ప్రేమజనించి వుండబట్టలేకపోవటమూ కాదు, యింట్లో భాగం అద్దెకువుందీ అని అడగటానికీ కాదు...గవర్నమెంటు వయోజన వోటర్ల లిస్టులుతయారుచేసే వుద్యోగుల్లో ఒకన్నిగా నన్ను నియమించింది. అందునిమిత్తంనేను ఎక్కిన గుమ్మాలలో అది ఒకటి. అంతే.

అనేకమంది యిటువంటివాళ్లు వుంటారని నేను ముందు గ్రహించకపోలేదు. అంతకుముందు రాత్రల్లా మేల్కొని, తెల్లారితే పరీక్షకి వెళ్లేవాడిలా, ప్రశ్నలు సమాధానాలు వల్లె వేసుకుని, సిద్ధంగా బయలుదేరాను.

సందు చివరినుంచే ఆమెను చూచాను. ఆ గుమ్మంలో నుంచునివుంది. పచ్చటి పుష్టయిన విగ్రహం. ఎర్రటిచీర గోచీపెట్టుకు కట్టుకునివుంది. మొదటి బోణీ ముత్తైదు- మంచిదే అని, ఆ యింటికే బయలుదేరాను. ఇంకా రెండు మూడు అడుగులు గుమ్మానికి దూరంగా వుండగనే, ఆమె నేను వస్తున్నది వాళ్ళింటికేనని గ్రహించి తలుపు 'ఫెట్లు' నమూసుకు లోపలికి పోయింది.

నాకు కోపంవచ్చిందని ఒప్పుకోకతీరదు. "ఏమండోయి, ఏమండోయి"—కొంచెం గట్టిగా అరచాను. సమాధానంవస్తేగా. మళ్ళీ, "ఏమండోయి, ఏమండోయి"...అబ్బే, ఏమిటి మూర్ఖం. ఈ మాటు తలుపులు తడుతూ పిలిచాను. పని జరిగింది. లోపల్నించి...కాదు, ప్రక్కని వున్న కిటికీలోనించి, "ఎవరువారు" అని సన్నటిగొంతుక.

'ఓటర్ల జా బి తా లు తయారుచేయడానికి వచ్చాను. మీ యింట్లో ఎందరు వున్నారు?' నేను సమాధానం యిచ్చాను అధికార పురస్కరంగా. లోపలి ఆమెను ఈమాటలు కదల్చలేకపోయాయి. రెండు నిమిషాలు గడిచాక, 'మా యింట్లో ఎందర[illegible]నే ఎందుకూ? ఆడవాళ్ళతో ఏం పని, మొగవాళ్లు వచ్చాక రండి.' కిటికీకూడా మూసుకుపోయింది.

మధ్యాహ్నానికి పని ముగించుకొని మళ్ళీఆయింటివైపే దారితీశాను. నేనుమళ్ళీ వస్తానని ఆమె అనుమానపడిందోఏమో.ఇంటికి తాళంపెట్టి ఎక్కడికో వుడాయించింది.

మరునాడు ప్రొద్దున్నే మళ్ళీ వెళ్లాను. మళ్ళీ మొదటి సమాధానమే. 'మొగవాళ్లెవరూ యింట్లో లేరు.'

అప్పట్లో చేసేదేమీ లేక, మిగతా పని సాయంత్రానికి పూర్తిచేసుకొని అటువైపే బయలుదేరాను. తలుపు తీసేవుంది. ఎవరో మనుష్యులున్నారు. చకచక మెట్లు ఎక్కాను. లోపల యిద్దరే మనుష్యులున్నారు. ఒకరు మొగాయన, రెండోది ఆవిడ. నన్ను చూడడంతోటే ఆమె లోపలికి వుడాయించింది. "నేను మొదలుపెట్టాను: రెండుసార్లువచ్చా,మీరులేరు. దయుంచి ఈఫారం పూర్తిచేసి సంతకంపెట్టండి." పుస్తకంచేతిలోపెట్టి, ప్రక్కనివున్న యినుపకుర్చీలాగుకుని కూర్చున్నాను.

ఆయన పనిఅయింది. 'ఇంకా ఎవరైనా, మీ ఆడవాళ్ళ వగయిరాలు...' నేను అన్నాను. ఆయన 'రాజ్యం' అని మెల్లిగా పిలిచాడు.

లోపలితలుపు కొద్దిగా తెరుచుకుంది. 'ఎందుకండీ'—ఆమె అంది. 'ఇలా రా ఒకమాటు' ఆయన సమాధానం.

ఆమె బయటికి వచ్చింది తలుపులు తీసుకొని. "ఏం" అన్నట్టు ఆయన ఆమెకేసి చూశాడు. "వద్దు" అని ఆమె గొణిగింది.

"అలాకాదు, తప్పులేదు...వ్రాయనీ" ఏవో మాటలు చెప్పాడు. ఆమెపట్టు సడలలేదు. చివరికి అంది. "ఎందుకొచ్చిన గొడవండీనాకు, యింట్లో వున్న ఆడాళ్ళని వున్నట్టు వుండనీయక యీ జాబితాల మాలోకంలో చేర్చి వీధిలోకి యీడ్వటం." లోపలికి వెళ్ళిపోయింది, తలుపులు వెనకాలే మూసుకొన్నాయి.

మొగాయన సమాధానానికి చూడకుండానే, ఆయన చేతిలోని పుస్తకం తీసుకొని బయట పడ్డాను.